వేగంగా గృహ నిర్మాణాలు

- జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల
- కొమరగిరి లేఔట్ సందర్శన

విశాలాంధ్ర - కాకినాడ : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కానున్నాయని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. హౌసింగ్-డే సందర్భంగా శనివారం రెవెన్యూ, నగరపాలక సంస్థ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖాధికారులతో కలిసి కాకినాడ సిటీ రూరల్ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన కొమరగిరి, నేమం 3,4 లే అవుట్‌లను సందర్శించారు. ఆయా లేఔట్ లోని గృహనిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో కూడా మాట్లాడారు. ప్రభుత్వపరంగా కల్పిస్తున్న వసతులను, లేఔట్‌లో కల్పిస్తున్న సదుపాయాలను కలెక్టర్ లబ్ధిదారులకు వివరించారు. కొమరగిరి లేఔట్‌లో నిర్మాణ ప్రగతిని అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా గడచిన మూడు నాలుగు నెలలుగా గృహ నిర్మాణ ప్రక్రియ జాప్యం జరిగిందన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో రానున్న 3-4 నెలల్లో గృహ నిర్మాణాలు వేగవంతమై గృహప్రవేశాలకు సిద్ధం కానున్నాయని కలెక్టర్ చెప్పారు. ముఖ్యంగా కొమరగిరి లేఔట్‌లో 13,000 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించామని, అక్కడ త్వరలోనే 5000 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. నిర్మాణాలు వేగవంతమయ్యే ప్రక్రియలో భాగంగా లేఔట్‌ల వద్దే ఇటుకల బట్టి పరిశ్రమను కూడా ఏర్పాటు చేశారన్నారు. నేమం లేఔట్ వద్ద రెండు కోట్ల వ్యయంతో వంతెనలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నేమం-4 లేఅవుట్‌లో సుమారు 1100 మంది లబ్ధిదారులకు స్థలాల కేటాయించినట్లు కలెక్టర్ చెప్పారు. నేమం-3 లేఔట్‌లో 7వేల గృహాలకు గాను ఇప్పటికే 330 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. అన్ని లేఔట్లలో నిర్మాణాలకు అనువుగా అన్ని సౌకర్యాలు వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కొమరగిరి లేఔట్ వద్ద కలెక్టర్ కృతికా శుక్ల లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్డీఓ బివి రమణ, గృహ నిర్మాణ శాఖ పిడి సుధాకర్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం శ్రీనివాస్, కాకినాడ నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, కాకినాడ అర్బన్, రూరల్ తహసిల్దార్లు వైహెచ్ఎస్ సతీష్, మొరార్జీ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, నామం సర్పంచ్ రామదేవు చిన్న, పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామంలో రెండు కిడ్నీలు పాడై డయాలసిస్‌తో బాధపడుతున్న కొల్లు భీమారావును మాతా రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం పరామర్శించి ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం చేసింది. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని మాట్లాడుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా సంఘ సభ్యులం అందరం డబ్బులు వేసుకుని తోచినంత సహాయం చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుంటున్న తన సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనాతవరం, చల్లపల్లి, చినగాడవిల్లి, అయినవిల్లి తదితర శాఖల సభ్యులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ప్రభుత్వ సాయం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన బడుగు యేసు ఇటీవల గోదావరి నదికి సంభవించిన వరదల కారణంగా మరణించడంతో తక్షణసాయంగా ప్రభుత్వం నుండి 4 లక్షల రూపాయలను కుటుంబ సభ్యులకు అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 6 లక్షల రూపాయలు చెక్కును ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు, వైస్ సర్పంచ్ పినమాల జ్యోతితాతాజీ, వైఎస్సార్సీపీ నాయకులు కర్రి నాగిరెడ్డి, వీరా గంగరాజు, కటారి గంగరాజు, నాగిరెడ్డి సాయి, ఆలమూరు తహసీల్దార్ లక్ష్మీపతి, వీఆర్వో సిద్దార్థ, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మ చల్లని చూపు ప్రజలపై ఉండాలి

విశాలాంధ్ర - ఆలమూరు : అమ్మ చల్లని చూపు, కరుణ కటాక్షాలు ప్రజలపై ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు మండలం ఆధ్యాత్మిక కేంద్రమైన చెముడు లంక తూర్పు డెల్టా ప్రధాన కాలువ తీరంలో ఆలమూరు మండల వైకాపా కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి అమ్మవారి ఆలయం పై నిర్మించిన అమ్మవారి భారీ ముఖ స్వరూపంతో పాటు అష్టలక్ష్ములను ఆలయ ప్రధాన అర్చక స్వామి ఎం. ప్రభాకర శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు హెూమాలు మధ్య శనివారం ఎమ్మెల్యే చిర్ల ప్రారంభించారు. శనివారం తెల్లవారుజామున 11 మంది దంపతులతో చండీ హెూమం నిర్వహించారు. సుమారు ఆరు లక్షల వ్యయంతో నిర్మితమైన అమ్మవారి ముఖ స్వరూప నిర్మాణానికి ఎమ్మెల్యే చిర్ల లక్షా యాభై వేలు రూపాయలు విరాళాన్ని ఇవ్వగా, మిగిలినది ప్రజా విరాళాలతో నిర్మించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్న సమారాధన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ దూలం రామలింగేశ్వర రావు, దొండపాటి చంటి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దిశా చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-చాగల్లు: మండల కేంద్రం చాగల్లు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత పై చర్చ దిశా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాగల్లు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిహెచ్ వి రమేష్ పాల్గొని ముందుగా మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ జన్మ దినోత్సవ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం దిశా చట్టం గురించి బాలికలకు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, మహర్షి స్కూల్ అధినేత బడేటి రమేష్, సూర్య స్కూల్ కరస్పాండెంట్ బాదంపూడి లక్ష్మీ, ఎస్‌విఆర్ కె స్కూల్ టీచర్ మహమ్మద్ బక్షి, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి కుందల వీరభద్రరావు రిటైర్డ్ టీచర్ వి. గంగాధరం పాల్గొన్నారు కార్యక్రమానంతరం బాలికలకు ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు.

చంద్రవరంలో : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో దిశా చట్టంపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా పోలీస్ వై. వెంకట కుమారి పాల్గొన్నారు. బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అటువంటివారు మనతో మాట్లాడాలని ప్రయత్నిస్తే దూరంగా ఉండి సమాధానం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈవ్ టీజింగ్ చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏదైనా ఆపద అనిపిస్తే ముందు ధైర్యంగా ఉండాలని విద్యార్థినిలకు చెప్పారు. ఉపాధ్యాయులు రమాంబ వి.జి.వి సుబ్బలక్ష్మి వీర వనితలు ఇందిరాగాంధీ ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయి దేశముఖ్, సరోజినీ నాయుడు తదితరుల జీవిత చరిత్రలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. సుమన్ కుమార్ అధిక సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ

విశాలాంధ్ర - తాళ్ళపూడి : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా తాళ్ళపూడి శాఖా గ్రంథాలయంలో మహిళా సాధికారితపై చర్చ, మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ దిశా చట్టం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సోషల్ టీచర్ ఎం.రాజకుమారి, రిటైర్డ్ ఎంఈఓ సిహెచ్. ఆంజనేయులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయాధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంపై వ్యాఖ్యలకు ఖండన

విశాలాంధ్ర - పి గన్నవరం : సీఎం జగన్ పై కర్నూలు పర్యటనలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను పి గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఖండించారు. ఈ మేరకు ఆయన పి. గన్నవరంలో మీడియాతో మాట్లాడుతూ 40 ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. 2019 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని 23 సీట్లకు మాత్రమే పరిమితం చేసిన రాష్ట్ర ప్రజలు నేడు చంద్రబాబును ఇప్పుడు రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు, వైకాపా నాయకులు అడ్డగళ్ళ సాయిరాం, యన్నాబత్తుల ఆనంద్, కొంబత్తుల యేసు బాబు, కుంపట్ల గోపి, సాధనాల రమేష్, అడ్డగళ్ళ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు పురస్కరించుకుని నవంబర్ 14 నుంచి నవంబర్ 22 వరకు క్రై బెంగుళూరు వారి అనుసంధానంతో శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కపిలేశ్వర మండలంలో కపిలేశ్వరంపురం, మాచర, నల్లూరు గ్రామాలలో ఉన్నటువంటి హైస్కూల్స్‌లో "మన మందరము కలిసి వచ్చి ప్రతి చోట పిల్లలకు అంతులేని అవకాశాల ప్రపంచాన్ని సృష్టిద్దాం మరియు వారు పూర్తిసామర్థ్యాన్ని గుర్తించడంలో సహాయ పడదాం" అనే అంశంలో భాగంగా పిల్లల డ్రీమ్ స్కూలు , గోల్ ఏ విధంగా ఉంది, పిల్లలు ఆలోచనకు అనుకూలంగా చిత్రపటాల ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నల్లూరు గ్రామ సర్పంచ్ కురు పూడి ఉదయశ్రీ రాంబాబు, స్కూల్ హెచ్ఎం డివిఎస్ లక్ష్మి శ్రమ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శేషగిరిరావు రావు, శ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఫ్‌డిటి విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర - రాజోలు : ఏఎఫ్‌డిటి విద్యాసంస్థలను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ శనివారం మలిపురంలో విద్యార్థుల భారీ ర్యాలీ, ధర్నా, మానవహారం నిర్వహించారు. ఏఎఫ్‌డిటి విద్యా సంస్థల విద్యార్థులు ఏఎఫ్‌డీటి విద్యాసంస్థల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మలికిపరం జూనియర్ కళాశాల నుండి టాక్సీ స్టాండ్ గాంధీ బొమ్మల సెంటర్ వరకు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించి సెంటర్లో మానవహారం నిర్మించి, సుమారు గంటసేపు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దాతల సహకారంతో మలికిపురంలో విద్యార్థులు అతి తక్కువ ఫీజులతో చదవాలని మంచి ఆశయంతో ఏఎఫ్‌డీటి సంస్థలను స్థాపించారని తెలిపారు. ఈ కాలేజీకి ఏ విధమైన సంబంధంలేని కొంతమంది విద్యాసంస్థల ఆస్తులను అక్రమంగా కబ్జా చేయాలనే ఉద్దేశంతో హైకోర్టు నుండి స్టేటస్కో తీసుకువచ్చారని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులని విద్యార్థులు చెల్లించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ఈ విద్యాసంస్థలను ప్రభుత్వ పరం చేయాలని, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఆదుకోవాలని ప్రభుత్వ విలీనంలో చేయడానికి వ్యతిరేకంగా హైకోర్టులో వేసిన కేసులను ఉపసంహరించుకొని విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్, అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్ రాపాక మహేష్, విద్యార్థి సంఘాల మాజీ నాయకులు పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, నేతల నాని, ఏఐఎస్ఎఫ్ నాయకులు సిహెచ్ వినయ్ చంద్, కే శ్రీనివాస్, ఏ రవితేజ, ఎస్ శ్యామ్ తేజ, డి. సాల్మన్, కే వర్మ, కృష్ణ, ఏబీవీపీ నాయకులు కే మణికంఠ, ఎం. హరి, ఎస్ఎఫ్ఐ నాయకులు టి. నవీన్, యు. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవం పెంచేలా పాలన

విశాలాంధ్ర - అనపర్తి : బీసీల ఆత్మగౌరవం పెంచే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఉందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం చినపాలమూరులో డాక్టర్ వైఎస్ ఆర్ శెట్టి బలిజ కళ్యాణ్ మండపం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవంలో పాల్గొని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ కమ్యూనిటీ హాల్, మంత్రి వేణు ఆడిటోరియం ప్రారంభించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాలుకు ఎంపీ నిధులు రూ.15 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. అనపర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి హాల్ట్ కు చేయడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ స్థానిక నల్ల కాలవ నుండి చిన పాలమూరు వరకు పూర్తిగా అభివృద్ధి చేయడం జరిగిందని దీని కొరకు రూ.80 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు) తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంతో మహిళలకు భద్రత

విశాలాంధ్ర - అంబాజీపేట : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం శాఖ గ్రంథాలయం అంబాజీపేట లో దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా మహిళలు, ప్రతి ఒక్కరూ దిశ యాప్ సెల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. దిశా చట్ట యాప్ మహిళలకు భద్రత విషయంలో భరోసా కల్పించగలదని అంబాజీపేట పోలీస్ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి. శ్రీనివాసు, గ్రంథాలయ పాఠకులు బి. సీతారత్నం, వెంకటలక్ష్మి, సీతామహాలక్ష్మి సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఇసుక మేట

విశాలాంధ్ర - సీతానగరం : రోడ్డు వేసిన చోట ప్రమాద భరితంగా ఇసుక మేట వేసింది. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల రాపాక తూముల దగ్గర నుండి ప్రభుత్వ పాఠశాల, కళాశాల, కార్యాలయాలకు వెళ్లే రహదారి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సినేరేజ్ నిధులు రూ.14.5 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణానికి ఉపయోగించిన ఇసుక, పిక్క రోడ్డు ప్రారంభంలో ప్రధాన రహదారి నుండి సీసీ రోడ్డుకు తిరిగే మార్గంలో రోడ్డు పై విడిచి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొంత మంది ద్విచవాహన దారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇసుక తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర- దేవరపల్లి : దేవరపల్లి శాఖ గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రంథాల అభివృద్ధి సంస్థ చైర్మన్ దాపర్తి సోమరాజు, గ్రంథాల అధికారి కే వి వి రెడ్డి, గ్రంథాలయంలో వివిధ పోటీలు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం వివి కుమారి యు రేఖ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

బాబు మాటలన్నీ మోసపూరితమే

విశాలాంధ్ర - అనపర్తి : రాష్ట్ర రాజధాని విషయంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం కొనసాగిస్తున్నారని ఆయన మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చేసే ప్రయత్నమే తప్ప ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు నిర్ణయానికి ప్రజలు మద్దతు తెలిపారని, గుంటూరు జిల్లాలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలే అందుకు నిదర్శమని అన్నారు. చంద్రబాబు నాయుడుకి 2024 చివరి ఎన్నికలు కాదని 2019 చివరి ఎన్నికలు అంటూ ఎమ్మెల్యే సత్తి ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు) తదితరులు ఉన్నారు.

ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్‌బి బాగ్చి, ఐపిఎస్, వారి ఆదేశాల మేరకు ఎస్‌పి పివి రవి కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు శనివారం మూడు బృందాలుగా ఏర్పడి రాజమహేంద్రవరం యూనిట్ పరిధిలోని తూర్పు గోదావరి జిల్లాలోని దేవరపల్లి మండలంలోని ఎస్ఏఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవరపల్లి, కాకినాడ జిల్లాలోని తాళ్ళరేవు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చొల్లంగి,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపేటలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదరు పాఠశాలలలో విద్యార్థుల హాజరు నమోదు, జగనన్న గోరుముద్ద పథకం నాణ్యత ప్రమాణాలు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ పరిశీలించారు. ఈ తనిఖిలలో డిఎస్‌పి పి. ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ నిస్పృహలో చంద్రబాబు

విశాలాంధ్ర - పెద్దాపురం : ముఖ్యమంత్రి వైఎస్ అందిస్తున్న జనరంజక పాలనకు ప్రజలు బ్రహ్మ రథం పడుతుండటంతో చంద్రబాబుకు మతి చలించి పిచ్చిమాటలు మాట్లాడుతూ వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నాడని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్‌సిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు తీవ్రంగా విమర్శించారు. శనివారం విలేకరుల సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చూస్తుంటే వికేంద్రీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమకు హైకోర్టు రాకుండా ఎందుకు చేస్తున్నారని ప్రజలు నిలదీసేసరికి చంద్రబాబు తట్టుకోలేక విచక్షణ కోల్పోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని దొరబాబు అన్నారు. చంద్రబాబు వేస్తున్న ఎలాంటి ఎత్తుగడలు పారవని, 2024లో కుప్పంతో సహా 175 సీట్లు వైస్సార్సీపీ గెలుచుకుంటుందని దవులూరి దొరబాబు ధీమా వ్యక్తం చేశారు.

రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలంలోని పేవరం గ్రామంలో రైతు భరోస కేంద్రంలో మంచి వ్యవసాయ పద్ధతులు, ధ్రువీకరణ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేరవం గ్రామాన్ని పైరెట్ ప్రాజెక్ట్ పొలంబడి కస్టరు కింద ఎంచుకున్నారు. శాస్త్రవేత్తలు రైతులకు వరి సాగును మేలైన పద్ధతులు ద్వారా సాగు చేయాలని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ దారు రాజశేఖర్ విచ్చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి, ఆత్మ పిడి కార్యక్రమంలో పాల్గొని రైతులుకు యాజమాన్య వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటను పండించడం వల్ల పర్యావరణం కలుషితం చేయకుండా కాపాడు కోవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంటి విజయభారతి, ఎమ్‌వి రామరావు, ఏడిఏ కొత్తపేట, మండల వ్యవసాయ అధికారి పట్టాబి రామయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కిర్లంపూడి : ప్రజా సహకారంతో గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జగపతి నగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి ఎస్సి పేటలో రెండు లక్షల రూపాయలతో నిర్మించ తల పెట్టిన కల్వర్టు నిర్మాణం పనులకు శ్రీలత శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసి సాదే కుమారి, గుడాల రాంబాబు, మాజీ ఎంపీపీ మురా సహదేవుడు, వార్డు సభ్యురాలు నందికళ్ళ మరియమ్మ, సాదే ఎసబ్బాయి, కట్టు నాని, బర్రే ఎసబ్బాయి, చుక్కా సుబ్బారావు, పందుగుల సూర్యనారాయణ, సాదే డేవిడ్ రాజు, మురా చిరంజీవి, గుద్దాటి శ్రీను, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మంచి పౌరులుగా ఎదగాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : నేటి సమా జంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం హర్షనీయమని, విజ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయాల్లో ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేసి మంచి వ్యక్తిత్వ పౌరులుగా ఎదగాలని కాట్రేనికోన జెడ్పీటీసీ నేల కిషోర్ కోరారు. 55వ జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా శనివారం కాట్రేనికోన గ్రంథాలయ అధికారిణి కె. తులసి లక్ష్మి ఆధ్వర్యంలో స్థానికంగా జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత, పాటలు తదితర పోటీల్లో విజేతలైన 65 మంది విద్యార్థులకు గ్రంథాలయ సంస్థ అందించిన ప్రశంసా పత్రాలు, పుస్తకాలను బహూకరించారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గురుకుల పాఠశాల విద్యార్థుల వనసమారాధన

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : స్థానిక గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు, వట్టిగెడ్డ జలాశయం వద్ద వనసమారాధన కార్యక్రమం శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకే అక్కడికి చేరుకున్న విద్యార్థులు ఆట పాటలు, డాన్సులతో అతిథులను కట్టిపడేశారు. అనంతరం అతిథులకు భోజనాలు వడ్డించి,వారు భోజనాలు ముగించారు. ప్రిన్సిపాల్ సత్యవేణి స్కూలు పిల్లలెవరు జలాశయం వద్దకు వెళ్లకుండా తన సిబ్బందితో గట్టి ఏర్పాటు చేశారు. స్థానిక ఇతరపాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది,ప్రభుత్వ హాస్పిటల్ సిబ్బంది పిల్లల తల్లిదండ్రులు ఈ వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

విశాలాంధ్ర-చింతూరు : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఏ ఫి కోర్ యు ని సేఫ్, ఐటీడీఏ పిఒ. ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఎర్రంపేటలో ఉన్న ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో శనివారం వరల్డ్ టాయ్ లెట్ కార్యక్రమం జరిగింది ఉద్దేశించి స్కూల్ హెచ్‌యం మరుగుదొడ్ల ఉపయోగాలు, నష్టాలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ పిల్లలు 470 మంది పాల్గొన్నారు. హెచ్ యం. కృష్ణ కుమారి , టీచర్స్, ఏఫికార్,యూనిసెఫ్, చింతూరు సూపర్వైజర్ పి. నరేష్ , వలంటీర్స్ చంద్రకళ, వెంకటలక్ష్మి దీపిక పాల్గొన్నారు. ఎర్రంపేట బాలుర కళాశాల వసతి గృహంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం బాలురు మొత్తం 250 మంది పాల్గొన్నారు. వసతి గృహం వార్డెన్ అశోక్ పాల్గొని జయప్రదం చేశారు.

గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాలు

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లోని గూడూరు ఆశ్రమ పాఠశాలలో గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఆదివారం నిర్వహించ నున్నామని ప్రధానోపాధ్యాయులు సీతారెడ్డి తెలిపారు. స్వాతంత్ర సంగ్రామంలో పోరాటయోధుల గురించి వివరించారు. వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుమ్మిరి సురేష్, మంగిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర- దేవరపల్లి : గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శనివారం గౌరీపట్నంలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను వికలాంగులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనార్ధన్ రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ రావి అన్నపూర్ణ, ఉపసర్పంచ్ ఆంద్రు రమేష్, వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో కొల్లూరు ఉమామహేశ్వర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర- కూనవరం: రేపాక గ్రామంలో ఎమ్.పి.పీ స్కూల్ నాడు నేడు పనులకు కూనవరం జెడ్పీటీసీ గుజ్జ విజయ శంకుస్థాపన చేశారు. పాఠశాల అభివృద్ధి పనులకు 12 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు మారుమూల గ్రామాల్లోని బడులకు సైతం నాడు నేడు ద్వారా ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారని తద్వారా పిల్లల్లో చదువుకోవాలనే సృజనాత్మకత పెరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, ఎంపీటీసీ ధర్మల అమ్మాజీ, హెచ్ఎంసి చైర్మన్ బుర్ర బుజ్జి, ఉపాధ్యాయులు ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



విశాలాంధ్ర- వి. ఆర్. పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డి గూడెం గ్రామం లో వెలసి ఉన్న శ్రీ సతీ పార్వతీ రుద్ర కోటేశ్వర స్వామి పురాతన దేవాలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా వి ఆర్ పురం గ్రామానికి చెందిన కదుపు రాము దంపతులు అన్నదానం శనివారం నిర్వ హించారు. ఈ అన్న దానం కార్యక్రమం లో సుమారు రెండు వేల మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి సన్నిధిలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు.

కరప ఎస్సైగా రామకృష్ణ

విశాలాంధ్ర - కరప : కరప ఎస్సైగా పనిచేసిన డి. రమేష్ బాబును సస్పెండ్ చేయడంతో ఇన్‌చార్జి ఎస్ఐతో నేటి వరకు స్టేషన్ కార్యకలాపాలు నిర్వహించారు. కాకినాడ త్రీ టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణను కరప ఎస్సైగా నియమించ డంతో శనివారం ఆయన కరప స్టేషన్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి



విశాలాంధ్ర - కిర్లంపూడి : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్విని పరుచుకోవాలి గోనేడ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జె. రవి అన్నారు. కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో గోనేడ యూనియన్ బ్యాంక్ మేనేజర్ జె రవి ఆధ్వర్యంలో ఆర్థిక సమిళీకృత కార్యక్రమం నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జనధన్ బ్యాంక్ ఖాతా తెరవడం జరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత బీమా యోజన జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలకు 304 అలాగే ముద్ర లోన్‌కు 30 డైరీలో నులకు 40 దరఖాస్తులు అందాయని వాటిని పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందనారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గోకేడ రాజా, వెటర్నరీ వైద్యాధికారి ఎం. గోవిందరాజులు, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, పలువురు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డి సెయింట్ థెరిస్సా కళాశాలను సందర్శించిన భారత్ అభియాన్ కోఆర్డినేటర్

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక సిహెచ్. ఎస్.డి.సెయింట్ థెరీసా స్వయం ప్రతిపత్తి మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 18, 19 తేదీలలో ఆంధ్ర విశ్వ విద్యాలయ ఉన్నత భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.పావని కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విశాఖపట్నం బివికె కళాశాల అధ్యాపకులు కె. నరసింహ మూర్తి ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో జరిగే పలు కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ ఉన్నత భారత్ అభియాన్ వాలంటీర్స్ గా విద్యార్థుల పాత్ర, వారు నిర్వర్తించాల్సిన విధులు, వారి మేధస్సును ఉపయోగించి గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలి, సాంకేతికాభివృద్ధి ఏ విధంగా పెంపొందింపచేయాలి సవివరంగా తెలియజేశారు. అనంతరం ఉన్నత భారత్ అభియాన్ విశ్వవిద్యాలయ కోఆర్డినేటర్ డా.బి.పావని, కె.నరసింహ మూర్తి, కళాశాల యుబిఎ అధ్యాపక బృందం, విద్యార్థినులు కళాశాల దత్తత గ్రామాలను అందలి పాఠశాలలను సందర్శించారు.

రైతు ఉపాయంతో పంట బోదె నుంచి ధాన్యం బయటకు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం వెల్లమిల్లి వద్ద పంట పొలాల నుంచి ధాన్యం రాశులు తీసుకురావడానికి పెద్ద పంట బోదే అడ్డుగా ఉంది. రైతు ఉపాయంతో ట్రక్కుతో ట్రాక్టర్లును పంట బోదెలో పెట్టి ధాన్యం రాశులను రోడ్డుపైకి శనివారం తీసుకొస్తున్నారు. అరుగాలం పండించడం పంట రైతు రోడ్డుపై తీసుకు రావడానికి అనేక కష్టాలు పడుతున్నారు. దానికి తోడు గోనే సంచుల కొరతతో రైతు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలు పొన్నం బుజ్జి తోటలో శనివారం కార్తీక వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఉసిరి చెట్టుకి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. వనభోజనాల కార్యక్రమానికి గ్రామ సర్పంచి లక్ష్మీ సునీత, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టి.నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రముఖ కవి మల్లెల జయరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథ పాలకులు ఆర్.కిషోర్ అధ్యక్షతన కవి సమ్మేళనంనిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు డాక్టర్ మల్లెల జయరాజు, మరీదు నాగేశ్వరరావులు వారు రచించిన కవితలను చదివి, పద్యాలను పాడి విద్యార్థినీ విద్యార్థులకు వినిపించారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే గ్రంథాలయాలకు వెళ్ళడం అలవరచుకోవాలని తెలిపారు. పుస్తక పఠనం వలన విజ్ఞానం పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

23న గురుకుల పాఠశాల పాత సామాగ్రి వేలం

విశాలాంధ్ర -చింతలపూడి : మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 23న పాత సామాగ్రిని వేలం పాట వేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పాత ఇనుము, చెక్క సామాగ్రి, అల్యూమినియం, స్టీలు, విద్యుత్ సామాగ్రి, ఆట వస్తువులు, న్యూస్ పేపర్లు, పాత పుస్తకాలు, పరీక్ష పేపర్లు, నిర్ణయించబడిన కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23 తేదీన వేలంపాట నిర్వహించనున్నామన్నారు. వేలంలో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు నకలుతో వచ్చి వేలంపాట నిబంధనలు తెలుసుకొని సంతృప్తి చెందినవారు ప్రిన్సిపల్ ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల బాలికల నాగిరెడ్డిగూడెం పేరుతో ఎస్‌బిఐ చింతలపూడి బ్యాంకులో చెల్లునట్లు రూ. 5వేల డిడి లేదా నగదు రూపంలో ధరావత్తు చెల్లించి జమ చేసిన తర్వాత వేలంపాటలో పాల్గొనుటకు అర్హులన్నారు. ఈనెల 22వ తేదీ సాయంత్రం లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ వివరాలకు9959666156 ఫోన్ నెంబర్ సంప్రదించవలసినదిగా కోరారు.

దళిత గిరిజన పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఏలూరు : దళిత, గిరిజన పాత్రికేయుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరిం చాలని, ఎస్‌సి, ఎస్‌టి వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి ఆనంద్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్లో జిల్లా రెవెన్యూ అధికారి మూర్తిని అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దళిత, గిరిజన పాత్రికేయులు అనేక ఆర్థికపరమైన ఇబ్బందులతో పాటు, వృత్తిపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. దళిత, గిరిజన పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికపరమైన రుణాలను మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కరోనా బారిన పడి అనేకమంది చనిపోయారని అటువంటి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మూర్తి మాట్లాడుతూ జర్నలిస్టుల ఇచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు జాలా బాలాజీ, ప్రధాన కార్యదర్శి దాసరి సుభాకరరావు, కమిటీ సభ్యులు పి. వెంకటనారాయణ, జి. రవికుమార్, బి. నరసింహరాజు, 20 మంది పాత్రికేయులు పాల్గొన్నారు.

సనపల ఔదార్యం శ్లాఘనీయం

విశాలాంధ్ర-ఉంగుటూరు : కైకరం జిల్లా ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సనపల రామకృష్ణ అమెరికాలో స్థిరపడి తాను చదివిన పాఠశాలల్లో విద్యా బోధనకి సాంకేతికతను చాలనే సంకల్పంతో కంప్యూటర్ లాజ్ డిజిటల్ తరగతు లను ఏర్పాటు చేయడం అభినంద నీయమని శనివారం పలువురు వక్తలు కొనియాడారు. రూ. 20 లక్షల సొంత నిధులను సమకూర్చి, కీట్స్ సంస్థ ద్వారా 30 కంప్యూటర్లతో లాబ్, 5 డిజిటల్ తరగతుల ఏర్పాటు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం టి.వి. రామ కృష్ణ అధ్యక్షత వహించారు. పాఠశాల పరమతిలో దాతలు, ప్రజా ప్రతినిధులు, స్థానికుల తాడ్పాటుతో పలు అభివృద్ధి కార్య క్రమాలు జరగటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి జయలక్ష్మి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, మానవత రీజినల్ చైర్మన్ పుప్పాల గోపి, కీట్స్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జి. అప్పారావు , కృష్ణారావు విష్ణుమూర్తి రామ్మోహన్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శానం లక్ష్మణరావు, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మురళి, పేరెంట్స్ కమిటీ మెంబర్లు కొనే వీర్ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం

నగర కమిషనర్ షేక్ షాహిద్

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల కాలనీలో నాణ్యత ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం జరుగుతుందని కమిషనర్ షాహిద్ తెలిపారు. స్థానిక పోణంగి ఇళ్ల కాలనీలో సంబంధిత అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ ప్రతి శనివారం ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై గృహ నిర్మాణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అన్ని ఇళ్ల కాలనీలో గృహ నిర్మాణాలు ప్రారంభించామన్నారు. పోనంగి కాలనీలో 7వేల గృహాలకు గాను వివిధ స్థాయిల్లో 5వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభం కాగానే బేస్మెంట్ స్థాయిలో ఎస్. హెచ్. జి ద్వారా ముందుగానే రూ.35 వేలు లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ సబ్సిడీ రూపంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కాలనీలో అంతర్గత రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ నెలాఖరు నాటికి కాలనీలో స్లాబ్ స్థాయి నిర్మాణాలు పూర్తి చేసి డిసెంబర్ 21వ తేదీ కల్లా పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగాలని కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సోమశేఖర్, హౌసింగ్ డి.ఈ సుధారాణి, హౌసింగ్ ఏఈలు, కాంట్రాక్టర్లు, సచివాలయ సిబ్బంది,గృహలబ్ధిదారులు, పాల్గొన్నారు.

విద్యార్థుల హాస్టల్ సంక్షేమ పోరుబాట

విశాలాంధ్ర - ఏలూరు : పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ, గురుకుల హాస్టల్ లో మెస్ చార్జీలు పెంచాలని టిఎన్ఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు పి.మహేష్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టిడిపి జిల్లా ప్రధాన కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఈనెల 21 నుండి 30వ తేదీ వరకు ఏలూరు జిల్లా పరిధిలోని సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులతో మమేకమవడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనా లను పునర్నిర్మించాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలుగు విద్యార్థి సంక్షేమ హాస్టల్ లో పోరుబాట బ్రోచర్ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు వేగి వినాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ అర్జ వెంకటరత్నం,జిల్లా అధికార ప్రతినిధి కొమ్మరెడి మణికంఠ, మారం సూర్య, గుండ్రు రత్నకుమార్, సర్వేశ్వరరావు, మెడకాయల రాజేష్, బొంటు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ జయంతి

విశాలాంధ్ర - పాలకొల్లు: పట్టణంలో ఇందిరాగాంధీ 105 వ జయంతి ని శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారతదేశానికి ప్రధానమంత్రిగా దేశానికి, పార్టీకి ఎనలేని సేవలు అందించారంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోనం వెంకట్రావు, పీసీసీ సభ్యులు షేక్ మహబూబ్ జానీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వర్ధనపు కాసు, హరికిరణ్, బెన్నీ పాల్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళా నేతల అరెస్టు అమానుషం

విశాలాంధ్ర-కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుడివాడలో జగన్ రెడ్డి ప్రభుత్వం అసమర్థతను ప్రశ్నించిన టీడీపీ దళిత మహిళా నేతలను అక్రమంగా అరెస్టు చేయటం జగన్ రెడ్డి దౌర్జన్యాలకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ విమర్శించారు. కృష్ణాజిల్లా మచిలీపట్టణం పార్లమెంట్ టిడిపి సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ అసిలేటి నిర్మల,మాదాల సునీత,బంటు రోజా, సునీతారాణి లను గుడివాడ పోలీస్ వారు అరెస్టు చెయ్యటం అమానుషమని అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారు వ్రాసిన రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రజా సమస్యలపై మోసం చేసిన ముఖ్యమంత్రిని ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ప్రజలకు ఉంటుందని అన్నారు.అందుకు విరుద్ధంగా ప్రజా సమస్యలు పై,మీ అసమర్థతను ప్రశ్నించిన మహిళ నేతలు పై అక్రమ అరెస్టు సిగ్గుచేటన్నారు.వెంటనే పోలీసులు కేసులను ఉపసంహరించుకుని మహిళా నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

విశాలాంధ్ర -నూజివీడు : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా కొత్తూరు లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు "సోషల్ మీడియా - యువతపై ప్రభావం" అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తూరు గ్రామ సర్పంచ్ మూడు శ్రీను మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలు పెద్దలు సోషల్ మీడియాకి ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారు అని, ప్రతిరోజు సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులు అవుతున్నారని, వీటివల్ల యువతకు బాలలకు మంచి కంటే చెడే ఎక్కువగా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు. పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు యం. లక్ష్మిపతిరావు, యం. రజని కుమారి, సిహెచ్ అనితా కుమారి, సచివాలయ మహిళా పోలీస్ బిందు ప్రియా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై చర్చ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథ పాలకురాలు రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు దిశ చట్టం, మహిళా సాధికారత చర్చా గోష్టి నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా పశ్చిమ డెల్టా బోర్డు చైర్మన్ గంజిమల దేవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవడానికి దిశ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినట్టు తెలిపాట. దిశ యాప్ ను ప్రతి ఒక్కరూ తమ సెల్ ఫోన్లలో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సీనమ్మ, మహిళ పోలీసులు రాఘవి, దివ్య, అడ్వకేట్ సొలస హరిశాకుమారి, పాల్గొన్నారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన 72 మంది విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మాంటిసోరి పాఠశాల

విశాలాంధ్ర- తణుకు : వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం పొందిన మొట్ట మొదటి పాఠశాల గా మాంటిస్సోరి పాఠశాల నిలిచిందని పాఠశాల వ్యవస్థాపకులు అనపర్తి ప్రకాశరావు తెలిపారు. అక్టోబర్ 22 వ తేదీన పాఠశాలలో నిర్వహించిన దీపావళి సంబరాలలో భాగంగా 2,600 మంది విద్యార్థులు వివిధ ఆకృతులలో ఉన్న మట్టి ప్రమిధులకు రంగులతో డిజైన్లు వేసి వాటిని 20అడుగుల పొడవు 20 అడుగుల వెడల్పులో పాఠశాల చిహ్నంగా కమనీయ ఆకృతిగా అలంకరించి ప్రదర్శించిన కళాఖండమునుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో సంపాదించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రకాశరావు అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇచ్చిన ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చూపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను ఉపాధ్యాయులను డైరెక్టర్ ప్రకాశరావు ప్రశంసించారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - సామర్లకోట : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని వేట్లపాలెం శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని గ్రంథాలయ అధికారి పి. విమలాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. అనురాధ విచ్చేసి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రామలక్ష్మి, శ్రీదేవి, లక్ష్మీ, ఝాన్సీ లక్ష్మి, భాను పాల్గొన్నారు.

రాజోలులో : భారతదేశపు మొట్ట మొదటి ఏకైక మహిళ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ 105వ జయంతిని శనివారం రాజోలు మండలం కడలి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి స్థానిక గ్రామ సర్పంచ్ చొప్పల గుణ నాథ్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కో కన్వీనర్ చిలకపాటి శ్రీధర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశానికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ప్రజల మన్ననలను పొంది ఉక్కు మహిళ ప్రధానిగా పేరుగాంచిన ఘనత ఆమెకు దక్కుతుందని గోపాలకృష్ణా రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు చవ్వాకుల రాము, మలికిపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పారి శ్రీను, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పెచ్చెట్టి శివశంకర్, విత్తనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ కుటుంబసభ్యులకు జనసేన పరామర్శ

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని గంగలకుర్రు గ్రామా నికి చెందిన శతాధిక వృద్ధురాలు వంగా వీరమ్మ (102) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వంగా వీరమ్మ కుమారులు రంగారావు, శ్రీనివాస రావు, మదన గోపాలరావులను జనసేన పార్టీ నాయకులు శనివారం పరామర్శించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. పరామర్శించిన వారిలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వేంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, నాయకులు అరిగెల సూరిబాబు, వీరా రవి, మంచాల నోకేష్, నూకపేయి సూర్య చంద్రరావు, గంగుల అన్నవరం తదితరులు ఉన్నారు.

రక్తదానం, రొట్టెల పంపిణీ

విశాలాంధ్ర-చింతూరు : ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదానం, రోగులకు గర్భిణీలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ , ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఫౌండర్ డైరెక్టర్ జయశాలి పిడి సుందర్ రావు జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవి మహేంద్ర , జెడ్పీటీసీ మురళి , ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ చిన్ని, వైయస్సార్సీపీ మండల ప్రెసిడెంట్ వై. రామలింగ రెడ్డి, సురేష్, రాంబాబు, వీర్రాజు, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రెసిడెంట్ రవి మాట్లాడుతూ ఏసుక్రీస్తు చేసినటువంటి బోధనలే ఇటువంటి కార్యక్రమాలకు ప్రేరణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెసిడెంట్ బేతం రవి, చింతూరు యు. వీర్రాజు, జారే లక్ష్మణ్ రక్తదానం చేశారు.

మున్సిపల్ ప్రధానోపాధ్యాయులకు డిడిఓ పవర్స్ పట్ల ఏపీటీఎఫ్ హర్షం

విశాలాంధ్ర- తాళ్ళపూడి : ప్రభుత్వ ఉత్తర్వులు 180 ప్రకారం మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అండ్ డిస్ బర్సింగ్ అధికారాలు ఇచ్చినందులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏపీటీఎఫ్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిడి రావు, ప్రత్తి సువర్ణ రాజులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఇప్పటి వరకు మునిసిపల్ కమిషనర్లకు పవర్స్ మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వడం శుభపరిణామం. దీని వలన ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. జీతాలు, సెలవులు , ఇంక్రిమెంట్స్, మెడికల్ లీవులు, 6,12,18,24 సంవత్సరాల ఇంక్రిమెంట్స్, ఆఫ్ పే లీవ్స్, యి ఓ ఎల్ స్, కమ్యూటెడ్ లీవ్స్, ఎపిజిఎల్ఐ, జిఐస్ మెడికల్ రియింబర్స్ మెంట్ మంజూరు చేయడం సులభతరం అవుతుంది అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో గల రాజమహేంద్రవరం, కొవ్వూరు, మరియు నిడదవోలు మునిసిపల్ ప్రధానోపాధ్యాయులకు ఎపిటీఎఫ్ పక్షాన అభినందనలు తెలి పారు.

నేటి నుండి బంగారు పాపమ్మ ఉత్సవాలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : అన్నదేవరపేట గ్రామస్తుల ఆరాధ్య దేవత , ఇలవేలుపు బంగారు పాపమ్మ ఉత్సవాలను ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు జరపనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు అప్పలస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని, స్థానిక సొసైటీ అధ్యక్షులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలుఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సారా విక్రయిస్తున్న ఇరువురు అరెస్ట్

విశాలాంధ్ర - నూజివీడు : నూజివీడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ, మురళీధర్ సిబ్బంది నూజివీడు మండలం సిద్ధార్థ నగర్ తండా గ్రామం వద్ద శనివారం దాడులు నిర్వహించగా అదే తండా కు చెందిన అంగోతు శ్రీను అజ్మీరా తవారియా అనే ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నాలుగు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కిరాణా, పచారి జాగరీ వర్తకులందరు బెల్లం విక్రయించేటపుడు జాగ్రత్తగా ఉండాలని, వారు అమ్మే బెల్లాన్ని నాటు సారా తయారు చేయుటకు ఉపయోగిస్తారనే అనుమానం ఉంటే వారికి విక్రయించరాదని తెలియ చేసారు. నాటు సారా, అక్రమ మద్యం,బెల్లం అక్రమ విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే 9440902462 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయ

విశాలాంధ్ర -చాట్రాయి : ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఐకమత్యంగా పని చేయాలని ఎపి కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి కోరారు. శుక్రవారం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంక నిర్మల అధ్యక్షతన ఎంపీడీవో ఎం.మురళీమోహన్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేశిరెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు ప్రతాప సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రస్థాయిలో తనకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించారన్నారు. అందరం సమిష్టిగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పర్వతాపురం సర్పంచ్ మిద్దే శివాజీ మాట్లాడుతూ తమ గ్రామానికి 104వాహనం రావడంలేదని 115 మంది పైగా రోగులు వున్నారని వారందరిని బురుగు గూడెం రమ్మంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి మాట్లాడుతూ కోనేరు రంగారావు పదవీకాలంలో అంగన్వాడీ భవనం నిర్మాణం ప్రారంభించామని నేటికి పూర్తి కాకపోవటం పట్ల అభ్యంతరం తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ చెలికాని అనూష, తహశీల్దార్ విశ్వనాథరావు, డాక్టర్ ఆఫ్రినా సుల్తానా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు జగన్మోహన్రావు, కొత్తగూడెం సర్పంచ్ చల్లగుళ్ళ వెంకటేశ్వరరావు, పోలవరం సర్పంచ్ లక్ష్మి ,చాట్రాయి ఎంపీటీసీ ఎస్.శివకుమారి, చింతకుంట్ల వెంకటేశ్వరరావు, చీపురుగూడెం ఎంపీటీసీ మోరంపూడి రాణి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్న సీఐ అంకబాబు

విశాలాంధ్ర -ఆగిరిపల్లి :శనివారం ఆగిరిపల్లి మండలం లో నెక్కలం గొల్లగూడెం ఈదర అడ్డరోడ్ శ్రీ శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానముకు నూజివీడు సీఐ అంకబాబు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేకమైన పూజలు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలికి శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు.

కాకినాడలో గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా 19 శనివారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దిశ పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఉత్తర్వులు ప్రకారం కాకినాడ దిశ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సింగంపల్లి కనకదుర్గ విచ్చేసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు ,పాఠకులు పాల్గొన్నారు.

దేశానికి ఎనలేని సేవలు అందించిన ఇందిరాగాంధీ

విశాలాంధ్ర - మండపేట : భారతదేశానికి ఎనలేని సేవలు అందించింది భారత తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఒక్కరేనని ఏఐసీసీ సభ్యుడు మండపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కామన ప్రభాకరరావు అన్నారు. ఇందిరాగాంధీ 105వ జయంతిని పురస్కరించుకుని కామన నేతృత్వంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ (రాజారత్న) సెంటర్, పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఇందిరా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరా ఆశయాలకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూని మాచరరావు, సామంచి సుబ్రహ్మణ్యం, పిల్లి అప్పన్న, కొడవళ్ళ సుబ్బారావు, ముగ్గళ్ల శ్రీను, కుచ్చు బాబి, వల్లబదాసు చిన్న, మగ్గం జాకబ్ రాజు, పెద్దిరెడ్డి మురళీ కృష్ణ, కురుపూడి చిరంజీవి, వాసిరెడ్డి సత్తిరాజు, జువ్వల ఆదినారాయణ, కే రాంబాబు, ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో: దివంగత మాజీప్రధాని ఇందిరాగాంధీ 105వ జయంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావు, పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి వెంకటేష్‌నాయుడు, తుమ్మలపల్లి వాసు, నవుడు గోవిందు, కామాడి కృష్ణారావు, తుమ్మలపల్లి వీరభద్రరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పెద్దాపురం ఎస్ఐ రావూరి మురళీమోహన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మిలు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పెద్దాపురం పట్టణ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రావూరి మురళి మోహన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశా చట్టం పట్ల ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలన్నారు. దిశా చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించడమే కాకుండా చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జోష్యుల కృష్ణ బాబు, మిరియాల జయశ్రీ, సింగం బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రజలకు రక్షణ కరువు

విశాలాంధ్ర - అమలాపురం : జగన్ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ కరువైనదని అన్యాయాన్ని,అక్రమణలను పెంచి పోషిస్తు న్నారని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి అన్నారు. శనివారం కామనగరువు గ్రామం నందు రాజలపూడి బులివెంకన్న నివాసం వద్ద మాటామంతి కార్యక్రమం జరిగింది. ఈ అన్నారు. పండగ వస్తే కావాల్సిన కిరాణా కిట్లు రేషన్ ఇచ్చేవారని ఇప్పుడవి లేవని, కాంపిటేటివ్ పరీక్షల ఫీజులు విపరీతంగా పెరిగిపోయాయని, దిశ చట్టం ద్వారా ఒరిగేదేమీ లేదని ఎటువంటి న్యాయం జరగడం లేదని, మద్యపాన నిషేదం అని చెప్పి మడమ తిప్పారని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మీడియా కో ఆర్డినేటర్ మాకిరెడ్డి వివిఎస్ పూర్ణిమ, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు గెల్లా మీనాకుమారి, అమలాపురం రూరల్ మహిళా అధ్యక్షురాలు యనమదల లక్ష్మి, పేరూరి విజయలక్ష్మి, గెద్దాడ సత్యవాణి రాజలపూడి భీముడు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి

విశాలాంధ్ర -భీమవరం: పురోభి వృద్ధిలో వందేళ్లుగా కష్టపడుతున్న భారత్ వైపు ప్రపంచ దేశాలన్నీ చూస్తున్నాయని యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ప్రణాళికా బద్ధంగా అవకాశాలను అందిపుచ్చు కోవాలని బెంగళూరుకుచెందిన అర్ధ స్కూల్ ఆఫ్ ఎంటరుప్రెన్యూరు షిప్ చైర్మన్ టి.ఎన్.హరి అన్నారు. శ్రీ విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'విష్ణోత్సవ్-2కె22' కార్యక్రమంలో భాగంగా జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో ఐదవ బ్యాచ్ విద్యార్థినిలకు పట్టాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వచ్చే దశాబ్దం సాంకేతిక అవసరాలను గమనిస్తూ వాటిని పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కె.వి.విష్ణురాజు, వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు